


# తెల్ల కిరీటం

కిరీటం హైదరాబాద్‌నుంచి సరాసరి ఆ వూరు వేంచేస్తోంది. అందుకే వయసు మళ్ళిన పెళ్ళికూతుర్లా వయ్యారం వలకబోస్తోంది పొగబండి చూడని ఆ పట్టణం. మనిషిని మరో మనిషి దోచుకుంటున్నట్లే, దాని నైసర్గిక ఆధిక్యతని బట్టి ప్రదేశమూ మరో ప్రదేశాన్ని దోచుకుంటున్నది. అందుకే తేనెతుట్టలాంటి చుట్టుపక్కల సంపన్న పల్లెపట్టులపై రాణి ఈగలా రాజ్యం చేస్తోంది ఆ వూరు. పండించటమేగాని, ఆ పంటను దాచుకోడానికీ లేక సొమ్ము చేసుకోడానికీ తావు లేని పల్లెలనుంచి సంపద ఆ పట్టణానికి తరలి వస్తోంది. బారులు తీరిన రెండెడ్ల బళ్ళు బస్సులు పోడానికి దారి ఇవ్వలేకపోతున్నాయి. గంట నుంచీ నిలబడిపోయిన బస్సులోంచి వేసారి క్రిందికి దిగాడు ముత్యాలరావు. మువ్వన్నె పతాకాలని తురుముకుంటున్న అక్కడి ముఖ్య కేంద్రాన్ని, మురికి తరలింపులో మునిగి తేలుతున్న మున్సిపాలిటీని

దర్శించాక ముక్కోటి సందేహాలు ముసురుకున్నాయి ముత్యాలరావు బి. ఎ. బుర్రలో. తట్టుకోలేక ప్రక్కనే పోతున్న శ్వేత కవచధారిని పృచ్ఛించాడు.

'ఏమిటండీ ఈ హడావుడీ' అని.

'రేపు మంత్రిగారొస్తున్నారు తెలీదా?' బొత్తిగా జనరల్ నాలెడ్జిలేదు అన్నట్లు పెదవి విరిచి కవచంతోపాటు సంక్రమించిన చిరునగవును వెలయించి ముందుకు సాగిపోయాడు.

ముత్యాలరావు బి. ఎ. పట్టం పుచ్చుకుని ముచ్చటగా మూడేళ్లయింది. మూడవ పంచవర్ష ప్రణాళిక ముగింపుకు వచ్చిందిగాని ముత్యాలరావు నిరుద్యోగానికి మాత్రం తుదిదొరకలా. ఆ ప్రయత్నంలోనే పై పట్టణానికి వెళ్తున్న ముత్యాలరావు మంత్రిగారి ఆగమన వార్తవిని బేక్రి వేసినట్లు పక్కన ఆగిపోయాడు. అటుపై రివర్స్‌గేర్ వేశాడు.

* * *

అమాత్యులవారు ఆ వూరు వేంచేస్తున్నట్లు వారంటినాలు ముందు గనే స్థానిక అధికారులకు శ్రీముఖాలు అందినాయి. కలెక్టర్ నుంచి కరణం వరకూ, పోలీస్ సూపరింటెండెంట్ నుంచి పోలయసెట్టి వరకూ ఎవరి అర్హతలుబట్టి వారికి వార్తలు వెళ్ళాయి. ప్రవాహానికి చేపలు ఎదురెక్కినట్లు మూడవ నాటినుంచి నోట్లు పైకి పాకడం ప్రారంభించాయి. కరణం నుంచి రెవెన్యూ ఇన్స్పెక్టర్‌కూ, అక్కడినుంచి తహశీల్‌దారుగార్కి అటుపై .... పైకి ఎవరి షేర్లు వారికి పోను పది వేలు జమయింది. పోలీస్ వసూళ్లు మాత్రం కొంచెం మందకొడీగా సాగేయి. ఆ వారంలోనే మామూళ్ళ కలెక్షనయిపోయింది. మరలా

టోపీ పెట్టుకునీ లాఠీ చేతపట్టుకుని బయల్దేరాలంటే ఎంత పోలీసు వారైతే మాత్రం కొంచెం మొహమాటంగానే తోచింది పాపం। అలా గని పూరుకుంటే డిపార్టుమెంటుకే తలవొంపులు. అందుకే నాటుసారా వ్యాపారస్థులకల్లా నాయకుడు నాయుడుగార్కి కబురెళ్ళింది.

నాయుడుగారు పరమ గాంధేయులు. అంతకంటె మహా సాత్వికులు. రాబోతున్న మంత్రిగార్కి పరమ ఆప్తులు. వీరిద్దరూ స్వాతంత్ర్య పోరాటంలో కాకలు తీరిన ఒక మహా యోధుడికి అంగరక్షకులుగా వుండేవారుట. మంత్రిగారితో నాయుడుగారి సాంగత్యం చిరస్మరణీయమైనది. ఒక బార్‌లో తీర్థం పుచ్చుకుని ఒకే సావిదగ్గర నిద్రించిన సౌహార్ధం వారిది. ఈ కిటుకెరిగిన పోలీస్‌వారు ఉభయకుశలోపరిగా సారా వ్యాపారుల నాయకత్వం స్వీకరించమన్నారు నాయుడుగార్ని. తప్పుతుందా। ప్రజాసేవయే తన పరమార్థం మరి।! ఆనాటినుంచీ ఆ ప్రాంత ప్రజలు నీటి యెద్దడైనా ఎరుగుదురుగాని నాటుసారా ఎద్దడిమాత్రం ఎరుగరు. శ్రీ నాయుడుగారి నీడలో బడుగు వ్యాపారులంతా గుట్టుగా బట్టీలు వేసుకుంటున్నారు. దీనికి ప్రతిఫలంగా వారానికి యాభై రూపాయల చొప్పున ప్రతి బట్టీదారూ నాయుడిగారికి చెల్లించాలి. ఇది తిరుగులేని రూలు. ఆ రూలు అతిక్రమించినవారు పోలీస్‌వారి నోటీస్‌లోకి పోవటం, వారు పల్లెలపై హటాత్తుగా దాడిచేసి బట్టీలు పగులగొట్టటం, లేకుంటే కుండలు నెత్తికెక్కించి కోర్టుకి నడిపించటం ఇదీ తతంగం. రూలు అతిక్రమించనిచో ఐచ్ఛికంగా నెలకో కేసు సమర్పించుకుని పోలీసుల ధర్మ పరిరక్షణ చేయాలి. ఈ పద్ధతి నాయుడుగార్కి కొంచెం ఇరకాటంగా కన్పించింది. అందుకే ఇటీవల కొన్ని నూతన ప్రతిపాదనలు తెచ్చారు.

కొత్తరూలు ప్రకారం బట్టీయులు తమగా ఎవరూ బట్టీలు వేయ

రాదు, సారా తీయరాదు. కష్ట నిష్టూరాలన్నీ భరించి నాయుడుగారే ఆ పని నిర్వహిస్తారు. పోతే వ్యాపారులంతా చిల్లరగానూ, టోకుగానూ తమవద్దనుంచి కొనిపోయి అమ్ముకోవచ్చు.

ఈ మార్పు నాయుడుగారు వట్టి వ్యాపార దృష్టితోనే చేసింది మాత్రం కాదు. ప్రజల శ్రేయస్సు పేరుతో తమ కుమార రత్నం సెలవిచ్చిన ఆర్థిక సూత్రాల పటుత్వాన్ని పరీక్షించాలనుకున్నారంతే. నాయుడుగారి కుమారుడు ఆవూరి కాలేజీలో ఎకనమిక్స్ బి. ఎ. చదువుతున్నాడు. అతడు ఒకనాడు చదువుకుంటూ చదువుకుంటూ తండ్రిగారితో ఇట్లా అన్నాడట :

'ఉత్పత్తి పెరిగేకొద్దీ ఉత్పాదన ఖర్చు తగ్గుతుంది నాన్నా. సరుకు చవగ్గా గిడుతుంది' అని. ఆ రాత్రంతా నిద్ర కోల్పోయి ఈ పథకం వేశారు నాయుడుగారు. వారి ప్రయోగం ఫలించింది. లాభాలు గూడ బాగానే వస్తున్నాయి. గృహ పరిశ్రమ ఇప్పుడు బృహత్పరిశ్రమ అయింది. కొద్దో గొప్పో నిరుద్యోగ సమస్యకూడా తీర్చి జాతీయాభివృద్ధికి తోడ్పడ గల్గుతున్నాననే సంతృప్తికూడ వారిలో వెలిగింది. తదభివృద్ధి నిమిత్తం ఖాదీ గ్రామోద్యోగ కమీషన్ నుంచి పరిశ్రమల పద్దుపై అప్పుకూడా ముట్టిందని వినికిడి.

* * *

పోలీస్ డిపార్టుమెంటు దూతగా నాయుడిగారి వద్దకు వచ్చిన కానిస్టేబుల్ తన కార్యార్థంతోపాటు మరో కమ్మని వార్తకూడా తెచ్చాడు. నాయుడుగార్కి లక్ష రూపాయలు లాటరీ తగిలిందట. పోలీస్ వారు ఆయన కంటగట్టిన ఆంధ్రప్రదేశ్ వెల్ఫేర్ ఫండ్ లాటరీ టికెట్లలో ఆ నంబరుందని దృష్టాంతంగా పేపరుకూడా తెచ్చాడు పిడుగు,

నాయుడుగారు తమ దగ్గరున్న టిక్కెట్లన్నీ ఆతృతగా పరీక్షించారు. పాపం ఎక్కడా ఆ నంబరే లేదు. ఆలోచించగా వారికి చటుక్కున గుర్తుకొచ్చింది వాటిలో కొన్ని తిరిగి తాను పోలయ్య సెట్టికి అంట గట్టినట్లు. కానిస్టేబుల్‌ను కమ్మగా పంపించి పోలయ్యసెట్టి ఇంటికి గుట్టుగా మనిషిని పరుగెట్టించాడు.

○ ○ ○

పోలయ్యసెట్టి లాటరీ టికెట్లతో సైకిలెక్కుతున్న సమయానికే కుమారుడు ముత్యాలరావు ఊడిపడ్డాడు.

'ఏరా అప్పుడే తిరిగొచ్చావు' అన్నాడు కొడుకును చూసి.

'రేపు మంత్రిగారొస్తున్నారుట నాన్నా. నాయుడుగారు చెబితే తప్పక ఉద్యోగం ఇప్పిస్తారు.'

'సరే నే నక్కడకే ఎల్తున్నాగానీ నువ్వింటి దగ్గర బేరాల్చూసుకో' అని సైకిలెక్కాడు పోలయ్యసెట్టి.

పోలయ్యసెట్టి నాయుడిగారి గృహ ప్రాంగణంలో అడుగుపెట్టేప్పటికి అనేక రకాల మానవాకారాలు అక్కడ సీరియస్‌గా ఏదో చర్చిస్తున్నాయి. సెట్టినిచూడగానే బోనులోవున్న పులికిమాంసం వేసినప్పటిలా ఆతృతగా లేచి ఇవతలికి వచ్చాడు. అతన్ని చూడగనే 'దండాలు నాయుడుబాబూ' అన్నాడు పోలయ్య.

'ఆ... రా రా పోలయ్యా' అంటూ ఆతృతగా అతణ్ని చేరాడు.

'తమరు లాటరీ టికెట్లు తెమ్మన్నారంట ఇయిగో బాబూ'

'అవును పోలయ్యా! పొరబాటున ఇచ్చారంట. తిరిగి తీసుకు రమ్మని ఇన్స్పెక్టరుగారు కబురెట్టారు... ఇచ్చేసి నీ పది రూపాయలు తీసుకుపో'.

'ఎందుకులే బాబయ్యా యీ కాయితాలు నాకు కూడెత్తయ్యా. ఇచ్చెయ్యండారికి' తలపాగాలోంచి పది లాటరీ టిక్కెట్లు తీసి ఇచ్చేసి చేతులు నలుపుకుంటూ నిలబడ్డాడు.

'ఏమిటి పోలయ్యా'

'ఏంలేదు బాబయ్యా! మంత్రిగా రొత్తన్నారంట. తవరు సెబితే కుర్రోడికి....'

'అలాగే పోలయ్యా! మాహ బాగా గుర్తుచేసావు. ఈ రాత్రికే మేమంతా బయల్దేరుతున్నాం. బంగ్లాలోకల్సుకోమను.... దానికేంలే... ఆమాత్రం సాయం చెయ్యతేనా నీకు.... వెంటనే బయల్దేరి రమ్మను... నీవిక వెళ్ల పోలయ్యా'

* * *

ముత్యాలరావు రాత్రికే మళ్లా పట్నానికి బయల్దేరాడు. ఉగ్రివెలర్స్ బంగ్లాకు చేరుకునేటప్పటికి ఇంకా చీకటి పడలేదు. నంజ వెలుగులో బంగ్లా పెద్ద కేపటిలిప్టులా వుంది. అంతవరకూ అధికారుల ప్రాంగణంలో కార్య నిర్వహణ చేసిన ఫర్నీచరు ఒళ్లు దులుపుకుని ఒక్కొక్కటే బంగ్లాలో చేరుతున్నది. ఊరిలోని పూలకుండీలన్నీ మంత్రిగారి ఆశ్రితజనంలా అలసట లేకుండ బంగ్లా చుట్టూ బారులు తీర్చి నిలిచాయి. అతను బంగ్లా ఆవరణలోకి అడుగు పెట్టేటప్పటికి అంతా హడావుడిగా వుంది. ముందుగా కోడిపెట్టల సామూహిక ఆక్రందన. అటు తర్వాత ఒకటి రెండు వైకుంఠ ప్రాప్తి పొందిన చప్పుడు విన్నాడు. నాయుడుగారికి ఎదురుపడి నమస్కారం చేసాడు.

'అ పక్క గదిలో కూర్చో ముత్యాలూ' లోపలి గదితో పేకాడుతున్న తన బృందాన్ని కలవడానికి వెళ్లాడు. వారి విలాసాల

ముచ్చట్లు, వికటాట్టహాసాలూ వింటూ గదిలోనే వుండిపోయాడు ముత్యాలరావు.

గంట తర్వాత ఆట ఆగిపోయింది. మషాలా వాసన, సీసాల చప్పుళ్లు, మూతలు పీడిన సీసాల్లోని ద్రవం గ్లాసుల్లో పొంగుతున్న అలికిడి— తనకు తెలిసీ, తెలియని మత్తు వాసనలు— ఇవీ అతని అనుభూతులు.

మళ్లా ఆట ప్రారంభమైంది. ముత్యాలరావుకు మగత నిద్ర పట్టింది.

మగత నిద్ర నుంచి ముత్యాలరావు మేల్కొన్నాడు.

ప్రక్కగదిలో గాజుల చప్పుడూ ఆడమనిషి ఆక్రందన విన్పించాయి.

'నన్నొదిలెయ్యండి బాబూ'

'ఒదిలెయ్యటానికేనా నిన్ను రప్పించుకున్నది'

'ఒక్కరే అని చెప్పాడు బాబూ. ఒక్కసారే అన్నాడు'

'నలుగురం వుంటే ఒక్కడే అంటే ఎట్లా? కావలిస్తే డబ్బు లెక్కవుచ్చుకో. నైటంత ఉండిపోవాల'

'మీ కాళ్ళట్టుకుంటాను. ఇది నా పని కాదు బాబూ. నా బిడ్డ జబ్బులో వున్నాడు. మందుకు డబ్బుల్లేక ఈ పాపానికి ఒడికట్టాను... నన్ను కనికరించండి'.

'ఉప్పుడేం మందు. పొద్దున్నే పోతూ పట్టుకుపో' నువ్వు కానీయరా వెంకటాద్రివ్'

'ఒద్దు బాబూ... నే వెళ్లిపోతాను... దిక్కులేని నా బిడ్డ ఎట్లా గున్నాడో...నన్నొదిలెయ్యండి...మీ డబ్బులొద్దు మీరూవొద్దు' ఏడుపు.

'ఈ కానీయ్‌రా....'

ఆర్తనాదం, ఆ తర్వాత మూలుగు, అబ్బా, అమ్మా అంటూ ప్రతిఘటిస్తున్న గాజుల చప్పుడు. ముత్యాలరావుతల వేడెక్కిపోయింది. తలుపు తెరుచుకు బయటికొచ్చాడు. అవతలి గది తలుపులు తెరిచే వున్నాయి. ముగ్గురు బయట నిలబడి వున్నారు. నాయుడుగారు లుంగీ సర్దుకుంటూ బయటికి వచ్చారు. ఆమె మొలపైకి పడివున్న మాసిన చీర కిందికి లాక్కుంటున్నది. జాకెట్టు పేలికలయింది. ఆ దృశ్యం అమానుషంగా తోచింది ముత్యాలరావుకు. కాని నోటమాట రాలేదు.

'దానికి డబ్బులిచ్చి పంపెయ్యండిరా' అన్నాడు.

'డబ్బులా... ఎప్పుడన్నా డబ్బులిచ్చావేంటి గురూ !'

నవ్వులు.

వారికి ఎదురుగా స్థాణువులా నిలబడ్డ ముత్యాలరావు అసంకల్పితంగానే 'అన్యాయమండీ' అన్నాడు.

'ఒరే ముత్యాలూ నీదగ్గర ఎన్ని డబ్బులున్నాయిరా'

'నలబై ...'

'నాలుగు రూపాయలు దాని మొహాన్న పారేసిరా పొద్దున్నే చూసుకుందాం' నాయుడు స్నానాల గదిలోకి వెళ్ళిపోయాడు. మిగిలిన ముగ్గురూ పేకాట టేబిలుపై తలవాల్చుకు పడుకున్నారు. దూరాన కోడికూత వినిపించింది. ఆమె ప్రక్కమీంచి లేవటానికి ప్రయత్నించి విఫలమైంది.

ముత్యాలరావు లోనికెళ్ళాడు.

'ఎంత కావాలమ్మా నీకు'

ఆమె తలెత్తింది. లోతుకుపోయినకళ్ళు, చెదరిన తైలసంస్కార

మెరుగని జుట్టు, ముఖం మీద తడియారిన కన్నీటి చారలు అతని హృదయాన్ని కదిలించాయి.

'ఏమ్మా ఎంత డబ్బివ్వాలి వాళ్ళు నీకు ?

ఆమె క్షణం అతని ముఖంలోకి చూసి పరుపులో తలదూర్చి వెక్కిళ్ళు తక్కుతూ ఏడుస్తున్నది.

బయట బూట్ల సద్దు వినిపించింది. వాచ్‌మాన్ అదలించాడు.

'ఒరే వీరన్నా ఇవాళ మళ్ళా తెచ్చావురా ?'

'పెద్దయ్యలొచ్చారు దొరలూ.... ఇంకెప్పుడూ'

'ఛత్... ఇవాళ లాభంలేదు... ఏది ఎక్కడ ?'

బంగ్లా వరండాలోకి నడిచాడు హెడ్ కానిస్టేబుల్ మరో ఇద్దరు జవాన్లతో...

నాయుడు పరామర్శించాడు.

'నేను చూసుకుంటాగా ... మీరు నిశ్చింతగా వుండండి... ఆ మాట మాత్రం....'

'అరరె.... నువ్విన్నిమాట్లు చెప్పాలా... మంత్రిగారు రాగానే చెబుతాగా...'

o o o

ముత్యాలరావు పదిరూపాయలనోటు ఆమె కివ్వబోతున్న సమయంలో ముగ్గురు జవాన్లు వారిని సమీపించారు.

'ఊ పదండి...'

ముత్యాలరావు చేష్టలుడిగి నిలబడ్డాడు.

'అన్యాయం బాబూ .. ఈ బాబుకేమీ తెలవదు. నన్ను తీసి కెళ్ళండి... ఆ బాబుని ఒదిలెయ్యండి.

'నీక్కూడ న్యాయాన్యాయాలు తెల్సే రంకు ..' ఆమె ఎము కల గూడుపైన లాఠీ తక్కున మోగించింది.

ముత్యాలరావుకు నెత్తురు వేడెక్కింది. అతనిలోవున్న మాన వుడు సుషుప్తినుంచి లేచాడు. కానిస్టేబల్‌ను ఒక తన్ను తన్నాడు.... అంతే ఇద్దర్నీ రక్తం చిమ్మేవరకూ మోటి సంకెళ్ళు వేసారు. ఆ తర్వా తనే నాయుడుగారు ప్రత్యక్షమయ్యారు.

'అంత దుడుకయితే ఎట్టారా ముత్యాలూ... నీకేం పర్వాలేదులే వెళ్లు. పొద్దున్నే నేనొచ్చి తీసుకొస్తాగా... నీవేం బెంగ పెట్టుకోకు.. మినిష్టరుగారితో మాట్లాడదాంలే వెళ్ళరా నాయనా...'

పోలీసులు ఇద్దర్నీ లాక్కుపోయారు.

ముత్యాలరావును లాకప్‌లో ఉంచారు.

ఆమెను ప్రక్కగదిలోకి నెట్టుకుపోయి తలుపులు వేశారు.

* * *

మంత్రిగారు బంగ్లాలోని ఎయిర్ కండిషన్డ్ గదిలో సుఖా సీనులై వున్నారు. వారి సైజు ఫేమ్ కుర్చీలో శరచ్చంద్రికల్లాంటి చలువ ఖద్దరు ధరించి హిమపన్నగంలా కూర్చొనివున్నారు. శీత శైలాగ్రాన్న చిక్కుకొన్న చంద్రబింబంలా వారి శిరస్సుపై శ్వేత మకుటం వుంది. ఒకటిరెండుసార్లు ఠీవిగా కిరీటాన్ని సరిచేసుకుని ఇంకా ఠీవిగా కూర్చోవాలని ప్రయత్నం చేస్తున్న సమయంలో ప్రశాంత వాతావరణాన్ని భంగపరుస్తూ అడుగుపెట్టాడు నాయుడు.

'ఎవిటి ?' అన్నట్లు భారమైన కనురెప్పల్ని అతి భారంగా ఎత్తి భారంగా చూశారు అమాత్యులవారు.

'మనవాళ్లు నీతో మాట్లాడాలంటున్నారు'.

'అంతా మనవాళ్ళే. ఆ వాళ్ళలో ఎవళ్లు వీళ్లు ?'

'అంతా గత ఎన్నికల్లో ఏదోవిధంగా సాయపడ్డవాళ్ళే'.

'ఇంతకీ వాళ్ళ పన్లేవిటో... ఏమీ పనిలేకుండా దైవదర్శనానికి వచ్చినట్లు వచ్చేరంటే.... నేన్నమ్మను.'

'పనులు లేకుండా ఎవళ్ళయినా మన దగ్గరకొస్తారా ?'

'అదేగా నేనూ చెప్పేది ? అందుకే అదేదో నువ్వే చెబుదూ మళ్ళా ఆ తలనొప్పెందుకు.'

'మరీ అంత ఇదిగా మాట్లాడకు. ఎన్నికలు దగ్గర పడ్తున్నాయి.' మంత్రిగారు మందహాసం చేశారు.

అటుపై కంట్రాక్టర్ కనకరాజు ప్రత్యక్షమయాడు.

'కనకరాజుగారూ కులాసాగా వున్నారా ? ఎవిటి చెప్పండి మీకు నేనేవిధంగా సహాయపడగలనో'.

'తమరే సహాయం చేయాలి. ఇంజనీర్ మంకుపట్టు పట్టుకు కూర్చున్నాడు.'

'ఏమంటాడు ?'

'ఎమ్ బుక్కంతా తప్పంటాడు. అసలు డ్రైయినేజి వర్కే జరగలేదంటాడు.'

'నిజం కూడా అంతేగదా ?'

'తమరుకూడ...'

'నిజం చెప్పండి. నేను మీ కొమ్ము కాసేవాణ్ణి.... నాకు అసలు విషయం తెలియకపోతే రేపు నేను చేసిన పనిని ఎట్లా సమర్థించుకోవాలి?'

'అసలు పని చేయకపోలేదు. ఏదో చేసిన మట్టుకు వర్షాలు పూడ్చేశాయి.'

'అదీ అలా చెప్పండి. అంటే మరలా టెండర్లు పిలవాల్సిన స్థితిలోనే వదిలేశారన్నమాట! మంచిది!! ఇంతకీ బిల్లెంత?'

'యాభై వేలు'

'పలుగు నేల మోపకుండా యాభై వేలు..'

'అబ్బే అలాగనటంలేదండి! సగం ఎలక్షను ఫండుకు జమ కడ్తాను'

'సరేలెండి.... శెక్రిట్రీ' పిల్చారు.

శెక్రిటరీ హాజరయ్యాడు.

'ఆ ఇంజనీర్‌కు ఫోన్‌చేసి వీరి పని చూడండి'

'అలాగే సర్' కనకరాజు వెంట వెళ్ళాడు సెక్రటరీ.

'ఊ.., తర్వాత కేసేవిటి నాయుడూ?'

'ఇక్కడ టూ టౌన్ స్టేషన్లో మనకొక్కడే పల్సిన హెడ్ కానిస్టేబులున్నాడు. ఆతని బావమరిదికి ఉద్యోగం వేయించాలి'.

'హెడ్ కానిస్టేబులంటే రాత్రి సెట్టి కొడుకును లాక్కుపోయిన వాడేనా?'

'ఊ...'

'అందుకు ప్రతిఫలమా?'

'ఏం చేయాలి. వాడు బయట వుంటే మన లక్షరూపాయల వ్యవహారం బయటపడుతుంది.'

'వాణ్ని ఉద్యోగం ఇప్పిస్తానని ఇక్కడికి తీసుకొచ్చావ్. లోప లికి తోయించి తోసినవాడి బావమరిదికి సిఫార్సు చేస్తున్నావు. భేష్! రాజకీయాల్లో పైకి పాకుతున్నావన్నమాట!'

'ఇంతకీ ఏమంటావు?'

'ఏమంటాను? ఏమన్నా అంటే మళ్లా నన్ను ఓట్లు అడగ నిస్తావా నువ్వు. సరే అప్లయ్‌చేసి హైదరాబాదు రమ్మను.'

కాస్సేపు నిశ్శబ్దం. తర్వాత నాయుడు—

'ఆ విషయం ఏంచేశావు?' అన్నాడు.

'ఏ విషయం?'

'కో-ఆపరేటివ్ ఆఫీసర్ గురించి ఇంతకు ముందోసారి చెప్పాను'

'వాడి తలబిరుసు ఏమీ తగ్గలేదా?'

'మరీ ఎక్కువైంది. మొన్న బేంకు ఎలక్షన్‌లో కొంచెం మన వర్గాన్ని ఫేవర్ చేయమన్నాను. నువ్వు చెప్పమన్నావని కూడ చెప్పాను. మీరు చెప్పినట్లల్లా చేయటానికి మీ నౌకర్నికాదు పొమ్మ న్నాడు.'

'స్థానిక విషయాలక్కూడా నేనే కలుగజేసుకోవాలా?'

'మరేం చేయమంటావు?'

'మన పెద్దపులిగాడితో చెప్పవోయ్. నాలుగు రోజుల్లో కేంపు వెళ్లబోతున్నాడు అట్నించటే పంపించమను'

'కొంపలంటుకుంటే?'

'నేనున్నాగా అర్పటానికి ... కేరీ ఆన్....'

'మరి నా బస్సు రూట్ గురించేం చేసావు?'

'బస్సు రూట్లు జాతీయం చేయబోతుంటే .. ఇంకా అదే రికార్డు వేస్తున్నావ్?' ఛాల గొప్ప జోక్ వేసినట్లు నవ్వారు మంత్రిగారు. నాయుడుగారు మాత్రం తన పోర్షన్ మర్చిపోలేదు.

'నీవు మంత్రిగా వుండి జిల్లాకి అంత అన్యాయం జరగ నిస్తావా?'

'జాతీయం చేయటం అన్యాయమే నంటావా?'

'మరి? ఎలక్షన్లకి అన్నేసి లక్షలెట్లా వస్తాయి?'

'ఔననుకో.... కాని.... మొన్న కేబినెట్ మీటింగ్‌లో వ్యవ హారం చూస్తే.... సరే చూద్దాం... హైదరాబాదొస్తున్నావుగా'

'ఆ పోలయ్యసెట్టి వ్యవహారం సెటిల్ చేసెయ్యి'

'ఇంకేం చెయ్యాలి?'

'అసలు ఇప్పుడేమయిందని.... ఒక రోజుంచుతారు, జుల్మానా వేసి పొమ్మంటారు. వాడు బయటికొస్తే ....'

మంత్రిగారు క్షణం ఆలోచించారు.

'శకత్రిటీ!'

'యస్ సర్ ...'

'ఆ యస్పీకి ఫోన్ చేసి నాకివ్వు'

ఎస్పీగారు ఫోన్‌లో వున్నారు.

'చూడండీ ... నిన్న బోత్రిల్ ఎక్ట్ క్రింద ఇద్దర్ని అరెస్ట్‌చేసి తీసికెళ్ళారు. వాళ్లని టూ టౌన్‌లో లాకప్‌లో వుంచారు .. వింటు న్నారా?.... ఆతను మర్లా బయటికి రాకూడదు.'

'అవతలి కంఠం ఏదో అభ్యంతరం చెబుతోంది.

ఫోను టక్కున పెట్టేశారు.

'పూర్తిగా వినకుండగనే పెట్టేశావే'

'వాడు రూల్సన్నీ తెల్సినవాడు. లక్ష అభ్యంతరాలు చెపుతాడు. విన్న తర్వాత అవుననక తప్పదు. అవన్నీ వినకుండ వుంటే వాడి తిప్పలు వాడు పడ్తాడు.'

'అంతే నంటావా ?'

'మరేంటను కున్నావు.... నేనింకా ఏదో ఎదిగిపోయావను కున్నాను... నువ్వింకా రాజకీయాల్లో ఎలిమెంటరీ స్టేజిలోనే వున్నావు.. సరేలే ఇక అయినట్లేనా ?'

'శ్రేష్ఠిగారి వ్యవహారం ఒకటుంది'

'చచ్చాం పో.... ఆయన్ని పిలవమాక నువ్వే చెప్పు'

'సేల్సుటేక్సువాళ్లు బుక్ చేసారు:..

'ఇదుగో నాయుడూ... ఇలాంటి వ్యవహారాల్లో నన్ను తల దూర్చమనకు'

'పోనీ ఏదయినా ఉపాయం చెప్పు'

'మీవాడు కాలేజీలో చదువుతున్నాడుగా'

అవునన్నట్లు తలూపాడు.

'కుర్రాడు మెరుకులాంటివాడని నా అభిప్రాయం. ఎలాగోలా రేపు సమ్మె చేయించమను.... ఇక మాట్లాడకు వెళ్ళి రెస్టు తీసుకో.

* * *

ఆ మర్నాడు పోలీస్ లాకప్‌లోవున్న ఆమె శవాన్ని బయటికి తీసారు.

ముత్యాలరావును లాకప్‌నుంచి జైలుకు తరలించారు.

కనకరాజు బిల్లు పాసయింది. సర్కారు బొక్కసంలో యాభై వేలు మైనెసయింది.

కేంపుకెళ్ళిన కోఆపరేటివ్ ఆఫీసర్ మళ్ళా తిరిగి రాలేదు. కొన్నాళ్ళ తర్వాత అతను ఆత్మహత్య చేసుకున్నట్లు వార్తలొచ్చాయి.

మంత్రిగారు హైదరాబాద్‌కు మరలిన మరుసటిరోజు స్థానిక కళాశాలలో సమ్మె జరిగింది. అక్కడి సేల్సుటాక్సు కార్యాలయం పరశురామ ప్రీతి అయింది.

నాయుడుగారు హైదరాబాద్ వెళ్ళారు. పోలయ్యసెట్టియిచ్చినలాటరీ టిక్కెట్టుపై పలికిన లక్షరూపాయల బహుమతిని అందుకున్నారు.

ఉపసంహారం :

పోలీస్ లాకప్‌లో ఆమె ఎట్లా చనిపోయింది ? తల్లిని బలిగొన్న ఆ బిడ్డ బ్రతుకేమైంది ? ముత్యాలరావుకు యావజ్జీవ శిక్ష ఎందుకు పడింది ? ఈ ప్రశ్నలకి జవాబుల్లేవు. అసలీ కథకు ముగింపే లేదు... పవిత్ర భారత దేశంలో ప్రతిచోట ప్రతిరోజూ జరుగుతున్న సంఘటనలే ఈ కథలు. ఆ ప్రశ్నలకు జవాబు దొరికేది ఈ వ్యవస్థ పూర్తిగా తుడిచిపెట్టుకుపోయి నూతన వ్యవస్థ ఏర్పడినప్పుడే.... అప్పుడే.... అదే... ఈ కథకి ముగింపు.

★